# మట్టి గుర్రం-

తెల్లవారితే దీపావళి. వెనకటి రోజుల్లో, అంటే ఇంకా మా పిల్లలు స్కూళ్లల్లోచదువుకునే రోజుల్లో ఎంత హడావిడి. పండగ పది రోజులుందనగానే అమ్మ, అత్తగారు నన్ను నిలబడనిచ్చేవారు కాదు. ఓసారిలాగే పండగ దగ్గరకొచ్చిందని చెప్పి మా పెద్ద మనిషిని బతిమాలి , బామాలి హాఫ్ డే పర్మిషన్ పెట్టి ఇంటికొచ్చే

సరికి రెండైంది. ఏమేం చెయ్యాలో పొద్దున్నే అనేసుకున్నాం కాబట్టి, అప్పటికే పెద్దవాళ్ళిద్దరూ పిళ్ళన్నీ జల్లెడ పట్టేసి పెద్ద పొయ్యి క్రిందకి దించి గాస్ సిలిండర్‌కి తగిలించేసి, ఒక నిద్రపోయి లేచి టీ కూడా తాగి రెడీగా ఉన్నారు. పండగ పేరు చెప్పి రెండు తీపి, రెండు ఖారా చేసి డబ్బాలకెత్తేస్తే వాళ్ల డ్యూటీ ఐపోతుందనీ, ఎవరొచ్చి వెళ్లినా తడువుకోనక్కరలేదనీ వాళ్ల తాపత్రయం. మా అమ్మ కాజాలు చెయ్యడంలోనూ, అత్తగారు లడ్డూలు చేయడంలోనూ దిట్టలు. ఇక నేను సరే. చేగోడీల స్పెషలిస్ట్‌ని. అంతా సీరియస్‌గా ఎవరిపనిలో వాళ్లుండగా మా అత్తగారు నెమ్మదిగా అంటున్నారు. "త్వరగా కానీయండొదిన గారూ! మళ్లీ అదొస్తే గొడవై పోతుందీ!" అని.

నా చెవిన పడనే పడింది. కానీ అర్థం కాలేదు. "నేనిక్కడుండగా ఎవరొచ్చి మిమ్మల్నేది? మీరేం కాని పని చేస్తున్నారనీ?"

మా అమ్మ చెప్పింది "నువ్వూ, నీ కూతురూ ఉండగా వేరే వాళ్లెందుకమ్మా రావడం మమ్మల్నినేందుకు. అదొచ్చే లోపల అంతా పూర్తి చేసి డబ్బాలు పైన పెట్టకపోతే మమ్మల్ని చంపేస్తుంది!"

"మీ ఇద్దరి గారాబం వల్లే అదలా తయారవుతోంది. ఎంత ఆకలైతే మాత్రం కాస్సేపాగలేదా ఏమిటి?" అని విసుక్కున్నాను. వాళ్లు ఒకళ్ల మొఖాలొకరు చూసుకుని మళ్లీ పనిలో పడ్డారు.

తీరా కాసేపయ్యేప్పటికి, "ఏమిటీ వాసనలూ! ఎవరు చేయమన్నారివన్నీనూ!!" అని అర్చుకుంటూ మా అమ్మ శక్తి ప్రత్యక్షమైనపుడు గానీ వీళ్ల కంగారుకి అసలు కారణం నా కర్థం కాలేదు. ఆవిడగారు ఉదయం బడికెళ్లేముందు చెప్పే వెళ్లిందిట. దసరాకి వీళ్లు చేసిన స్వీట్లూ తిని తిని జీవితం అంటేనే విరక్తి వచ్చేసింది కాబట్టి ఈ పండక్కి పిండి డబ్బాలు కిందకి దింపి స్వీట్లు చేస్తే అవన్నీ సోనీకి పెట్టేస్తాననీ, వాళ్లనాన్నతో కలసి కార్లో పుల్లారెడ్డికో మధుబన్‌కో వెళ్లి మంచి మంచి స్వీట్లు తనకి నచ్చినవి కొంచెం కొంచెంగా కొనుక్కుంటాననీనూ! ఐనా వాళ్లిద్దరూ నాకా విషయం తెలియనీకండా మొత్తానికి పని మొదలెట్టించేశారు. ఆవిడగారు కోరుకున్నవన్నీ కొంటానని ప్రామిస్ చేశాక మేం చచ్చీ చెడీ చేసినవి ఓ ప్లేట్‌లో సర్దుకుని ఉయ్యాల మీదకి పోయింది ఊగుతూ తినడానికి. ఎప్పుడూ మగపిల్లలతో పేచీలుండేవి కాదు కానీ, దీనితో మాత్రం ఏ విషయమైనా మా ముగ్గురికీ భయమే!

ప్రతీ పండక్కీ పొద్దునే లేచి వాళ్ల బామ్మ దగ్గర కూచుని రకరకాల కలలు చెప్పేది. రాత్రి వినాయకుడు కనపడి పులిహోర అందరిళ్లల్లోనూ తినీ తినీ విసుగొస్తోంది, జీడిపప్పులేసి పులావు నైవేద్యం పెట్టమన్నాడనీ, అమ్మవారికి అన్నప్పరమాన్నం తినాలని లేదుట కసాటా ఐస్‌క్రీం పెట్టమందనీ, ఇలా ప్రతీ పండగకీ ఆయా దేవుళ్లు దీని కలలోకి వచ్చి కోరేవారు. నా పేరు చెప్పి వాళ్ల బామ్మ దగ్గరా, వాళ్ల నాన్న పేరు చెప్పి నా

దగ్గరా, ఎలాగోలా మొత్తానికి తన మాటే నెగ్గించుకునేది. దాని గారాబాలన్నీ చూసి నలుగురాడ పిల్లల్ని అలాగ్గా పెంచి ప్రయోజకుల్ని చేసి సగర్వంగా తిరిగే మా అమ్మకి తగని కోపం వచ్చేది. ఇది ఎవడ్ని కట్టుకుందో గానీ, ఓ ఆటాడిచ్చేస్తుంది. చూస్తూ ఉండు! అని నన్ను హెచ్చరించేది. మళ్లీ మళ్లీ దీపావళి వస్తూనే ఉంది. కానీ ఇపుడా పండగ తలంట్లు లేవు. పిండి వంటలూ లేవు. పండగొస్తోందో అని తెగ హడావిడి చేసే పెద్ద వాళ్లు పై కన్నా పోయారు. పక్కకన్నా సర్దుకున్నారు. మన పిండి వంటలు పిల్లలు అంత మెచ్చరని గ్రహించి ఒప్పుకునే సరికి వాళ్లు పెద్దవాళ్లైపోయి ఎవరిళ్లకు వాళ్లెళ్లి పోయారు.

ఆ తర్వాత నాకీ పనుల మీద శ్రద్ధ పోయింది. పండగొస్తే దగ్గర్లో ఉన్న స్వగృహా కెళ్లడం, తలో పావు కిలో తెచ్చుకోడం. తెచ్చుకున్నవి కాస్తా తినేయడం. ఎవరి గదుల్లో వాళ్లు దొర్లడమూ. కాకపోతే గుడ్డిలో మెల్లలాగా పండగ సంబరాల భారమంతా అన్ని కంపెనీల వాళ్లూ నెత్తికేసుకుని కేబిల్ ఛానెల్స్ ద్వారా ఇది పండగర్రోయ్ అని మొత్తుకుంటూంటారు తెల్లారకట్లనించి, అర్ధరాత్రి వరకు. తిని తిట్టి పోయే బంధువుల కన్నా, నవ్వుతూ, నవ్విస్తూ పలకరించిపోయే తారలే క్షేమకరం శుభకరం.

కాబట్టి ఏదైనా సంబరం చేసుకోడానికి మనుషులే స్వయంగా కలవక్కరలేదని తెలిసిపోయిందందరికీ. ఇపుడే ఇలా ఉన్నాయి రోజులు. మాకు ముసలితనం వస్తే ఇంకా ఎలా ఉంటాయో? ఇలా తేలేని గతాన్ని తల్చుకుంటూ, ఉందో లేదో తెలియని భవిష్యత్తుని భారంగా ఊహించుకుంటూ, నాలో నేనే చికాకు పడుతూ నిజంగా నరక చతుర్దశిని సెలబ్రేట్ చేసుకుంటూండగా ఫోన్ మోగింది. అదొక్కటే నేను ఎలాటి పరిస్థితిలో ఉన్నానో తెలియక అస్తమానం పలకరించే సాహసం చేస్తుంది.

"సుశీల గారున్నారా?"

"ఉండబట్టేగా! మాట్లాడుతున్నానూ!"

"మీరేనా! నమస్కారం. నేను ఆనందిని మాట్లాడుతున్నాను. అంతా కులాసాగా ఉన్నారా?"

"నువ్వా !చెప్పవూ. అన్నయ్యొచ్చారా ? ఎలా ఉన్నాయి సేల్సూ?"

"అన్నయ్య మార్చిలో వస్తారట. పండగ సీజనుగా! సేల్సు పరవాలేదు. ఒకపని పడి ఉత్తరం రాస్తే అన్నయ్య మిమ్మల్ని కలిసి సాయం తీసుకోమన్నారు!"

"ఎల్లుడిరా! ఏమిటి పని? బ్యాంకుదైతే మాత్రం, నా ప్రయత్నాల మీద పెద్ద ఆశలేం పెట్టుకోకు!"

"నాకు మీతో ఉన్న పనే అది మరి! రమ్మంటే నేనూ, బదరీ అన్నయ్యా పదిగంటలకి తిన్నగా ఫ్యాక్టరీ కొచ్చేస్తాం!"

"దీపావళి మురుకులో?"

"అవొక్కటేనా! ఇంకా నాలుగైదు రకాలు మార్కెట్ చేస్తున్నాం. వచ్చేపుడు తెస్తా కానీ, ఒక్క షరతు. మీరు డబ్బిస్తా ననకూడదు!"

ఆ అమ్మాయి పేరు ఆనంది. మేం బెంగళూరులో చిలోపోలోమని తిని తిరుగుతూ రిసెర్చి చేస్తున్నా మనుకునే రోజుల్లో మాతోబాటే తిరిగే అనంత కృష్ణ అనే రిసెర్చి స్కాలర్ ఆఖరి చెల్లెలు. అతను మా కన్నా మహా ఐతే నాలుగైదేళ్ళు చిన్నయి ఉంటాడేమో! ఆ మాత్రానికే చిన్న పిల్లాడిలా జమ కట్టేవాళ్ళం. మా గ్రూపులో చిన్నవాడేమో కానీ, తన కుటుంబానికి మాత్రం అతనే పెద్ద దిక్కు. అతనింకా చదువులో ఉండగా నే, మరదలితో పెళ్ళి అవటం, తండ్రి పోవడం లాటివన్నీ అయి తనే ఇంటికి పెద్ద వాడయ్యాడు. సంప్రదాయ శ్రీవైష్ణవ కుటుంబం, ఐదారుగురు చెల్లెళ్లు , తమ్ముళ్ళు. పల్లెటూళ్లో ఉండి దేవాలయం మీద ఆదాయంతో కాలం గడిపేవారు. ఇతను క్వార్టర్స్‌లో భార్యా పిల్లలతో క్లుప్తంగా జీవిస్తూ అక్కడి కుటుంబ భారమంతా, సణక్కుండా గొణక్కుండా సహిస్తూ, నిజంగానే సినిమాల్లో పెద్దన్నయ్యలానే ఉండేవాడు. ఈ పిల్లలు వేసవి సెలవులకని వచ్చినపుడు చూస్తుండే దాన్ని. సంపద పంచుకునే కుటుంబ సభ్యులు తరచూ తగుల్తానే ఉంటారు గానీ, సమస్యలు పంచుకునే సభ్యులున్న కుటుంబాలంటే నాకు చాలా గౌరవం. ఎందుకంటే, ఎక్కడోగానీ కనిపించరు.

కాల ప్రవాహంలో , అందరూ వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడి ఉద్యోగాల్లోనూ, జీవితాల్లోనూ స్థిరపడి పోయారు. చివరమ్మాయి ఆనంది మాత్రం పెళ్లి చేసుకోదల్చుకోలేదని చెప్పి స్వతంత్రంగా చిన్న వ్యాపారం పెట్టింది. రకరకాల మసాలా పౌడర్లూ, బియ్యం పిండి అప్పడాలూ, మురుకులూ, జంతికలూ లాంటి కొన్ని స్నాక్స్ ఇంట్లోనే ఓ ఇద్దరు పనివాళ్లని పెట్టుకుని చేయించి షాప్స్ ద్వారా అమ్మిస్తూ ఉంటుంది. ఎన్నో సార్లు అన్నా " ఎందుకంత చిన్న స్కేలులో చేస్తావు? కాస్త పెట్టుబడి పెట్టి ఇంకొంచెం ఎక్కువ లెవల్లో చేస్తే బాగా పేరొచ్చి నాలుగు రాళ్లు మిగుల్తాయి కదా!" అని. కానీ, వాళ్లకేమో అప్పంటే చాలా భయం. ఉన్నంత లోనే చేసుకుందాంలే, పరిగెడుతూ పాలు తాగడం ఎందుకు అనే మనస్తత్వం వాళ్లది. అలాటమ్మాయి ఇపుడు బ్యాంకు లోను తీసుకుందామనుకుంటోందంటే మంచి ప్రొగ్రెస్సున్నట్లేగా.

కానీ, నా అనుమానాలు నాకున్నాయి. బ్యాంకులవాళ్లు ఎన్ని ట్రైనింగులు మాటి మాటికీ తీసుకున్నా, అమ్మగల ప్రొడక్టుంది కదా అని లోను కోసం వచ్చే వాళ్లకీ, లోను దొరికితే ఏదైనా చేయచ్చునని బ్యాంకు కొచ్చే వాళ్లకీ తేడా కనిపెట్టలేరు. తప్పిదారి కనిపెట్టినా ఒప్పుకోరు. ఒప్పుకున్నా సమయానికి లోను మాత్రం ఇవ్వరు. కింద బ్రాంచి వాళ్లు ఒప్పుకుంటే, హెడ్డాఫీసు ఒప్పుకోదు. వాళ్లెవరినైనా పైనించి కిందకి రికమెండ్ చేస్తే, మమ్మల్ని కాదని పైవాళ్ళ దగ్గరికెళతావా అంయ్ అని కింద బ్రాంచివాళ్లు మొదలంటా

చెడగొట్టేస్తారు. ఒక వేళచిన్న, పెద్ద మానేజర్లందరూ సమాధానపడి ఇస్తామంటే వాళ్ళ లీగల్ సెల్ వప్పుకోదు. ఇవన్నీ అయేటప్పటికి ఆ ప్రోడక్టు కన్నా ఆ తిరిగేవాడికన్నా ఆయుష్షు చెల్లిపోతుంది.

సరిగ్గా పదింటి కల్లా వచ్చారు. ఆనంది, వాళ్ళ ఆఖరి అన్నయ్య బదరి, మా యూనిట్కి నాలుగు పెద్ద పాకెట్లు పుచ్చుకుని .

"ఉండు. కొంచెం తిన్నాక మాట్లాడుతా! లేకపోతే, పనవలేదని తీసుకుపోతావేమో!" - అని నవ్వా. వాళ్లు నవ్వుతూ కూచున్నారు.

"పండగ బాగా చేశారా? నేను మీకు చెప్పా కదా, కొంచెం బ్యాంకు లోను తీసుకుందామని!"

"ఎంత చెప్పు!"

"18 - 20 వేలుంటే సరిపోతుంది. రెండు పెద్ద గ్యాస్ పొయ్యిలూ, ఒక వెట్ గ్రైండరూ, ఒక ఓవెనూ లాటివి. కొటేషన్లు కూడా తెచ్చాను."

"ఇంతేనా! ఈ మాత్రానికి పెద్ద ప్రాబ్లెముండదులే. అప్లికేషన్ రాసుకొచ్చావా?"

"మనం ముందు మాట్లాడాక రాద్దామని!"

బదరినక్కడే కూర్చోపెట్టి ఇద్దరం కలిసి బ్యాంకుకెళ్లాం. అప్పుడు మా యూనిట్కి ఉన్న ఫీల్డాఫీసరు కొత్తగా రిక్రూటైన కుర్రాడు. మహా అసాధ్యుడు. చేరిన ఏడాదికే అన్ని బ్యాంకు సూత్రాలూ వల్లె వేసి తాతకి దగ్గులు నేర్పే స్థాయికి ఎదిగి పోయాడు. మన చేతిలో డ్రాఫ్టే ఉందో, లేపోతే ఎక్సెస్ విత్డ్రాయల్కి రిక్వెస్టుందో ఎలా కనిపెడతాడో మరి. డ్రాఫ్టితో వెడితే వెంటనే పలకరిస్తాడు. "నమస్కారం మేడం. ఆర్డర్ పొజిషనెలా ఉంది? ఈ సంవత్సరం పెద్ద ప్రాబ్లెముండదు లెండి!" అని చక్కగా కబుర్లు చెప్తాడు. అదే నాలుగు రోజులయ్యాక ఏ కరెంటు బిల్లో కట్టాలి పదివేలివ్వండి మహాప్రభో అని భూత,భవిష్యత్,వర్తమాన కాలాల వివరాలన్నీ రాసుకుని అర్జీతో వెళ్లి ఇంత లావు మనిషిని ఎదురుగా కూచుంటే పావుగంటైనా తలెత్తడు. ఏమిటో బ్రహ్మరాత రాసుకుంటూ, పక్క ట్రేలలోంచి ఏవేవో కాగితాలు తీస్తూ, వెనకాతల బీరువాలో ఫైల్సన్నీ కెలుకుతూ, భయంకరమైన వేషాలేస్తాడు. నా మీద కొండంత ఆశ పెట్టుకు వచ్చిందీ పిల్ల. పరువుతీయకుండా ఉంటే చాలని, లోలోపల ఆదిత్యహృదయం చదువుకుంటున్నా. చివరికి వచ్చి కూచు న్నాడు.

"ఈ అమ్మాయివాళ్లు మాకు చాలా కావలసిన వాళ్లు. పేరు ఆనంది. ఒక సంవత్సరంనించి చిన్నగా మసాలా పౌడర్స్, స్నాక్స్ చేసి జ్యోతి కిచెన్ అనే బ్రాండ్నేమ్తో అన్ని స్టోర్స్కి, రెస్టారెంట్లకి సప్లై చేస్తూంది. ఆ లైను తనకి బాగా నచ్చింది. తేలికగా మానేజ్ చేయగల్గుతోంది. అందుకని అంతా పని వాళ్లతో కాకుండా

కొంత ఎక్విప్‌మెంట్ కొంటే టర్నోవర్ పెరుగుతుందని లోను కోసం ప్రయత్నం. మన బ్యాంకేమన్నా సహాయం చేస్తుందేమో?"

"ప్రస్తుతం మీరు నెలకి ఎంత అమ్మకాలు చేస్తున్నారు?"

"10,12 వేల మధ్య!"

"కొత్త ఎక్విప్‌మెంట్ కొంటే, ఎంతౌతుందనుకుంటున్నారు!"

"30వేల దాకా చేయవచ్చనుకుంటున్నాం!"

"మీకెంత అవసరం పడుతుందో?"

"ఒక 20 వేలు చాలు. ఇప్పటికే నా దగ్గర కొంత ఉంది!"

"ప్రెమిసెస్ మీ స్వంతమా? ఎక్కడుంది మీ వర్క్ ప్లేస్?"

"కాదండీ. నల్లకుంటలో ఒక కారు షెడ్ మా వాళ్ళది అద్దెకు తీసుకుని చేస్తున్నాం."

"చెప్పరేం మరి. నల్లకుంటైతే ఇక్కడ లోనివ్వడం కుదరదు. మీరక్కడ బ్రాంచికే వెళ్లాలి."

"నల్లకుంటలో ఒక బ్యాంకుకెళ్లామండి. కానీ, ఇంత చిన్న మొత్తాలివ్వమన్నారండి!"

"మా బ్రాంచీ కెళ్లారా?"

"మీ బ్రాంచక్కడ లేదు కదా!"

"విద్యానగర్లో ఉంది కదా! అక్కడికెళ్ళి ప్రయత్నం చెయ్యండి!"

"పోనీ, మీరా బ్రాంచి మానేజర్ గారికి ఫోన్‌చేసి చెప్పకూడదూ? మేం ఇద్దరం వెళ్లి కలుస్తాం."

"అయన ఎవరుచెప్పినా వినరు. రూల్స్ ప్రకారం పోయే మనిషి!"

ఓపిగ్గా వింటున్ననాకు ఒళ్ళుమండిపోయింది. "అంటే ఈవిడకి లోనిచ్చేందుకు రూల్స్ ఒప్పుకోవా? మేమేదో మిమ్మల్ని మాయ చేసి డబ్బులెత్తుకు పోడానికి వచ్చినట్లనుకుంటే ఎలా? మరి స్వయం ఉపాధితో జీవించే మహిళలకి మీరు చెయ్యిస్తున్నట్లు ,సారీ చెయ్యందిస్తున్నట్లు అన్నిగోడలమీదా రాసుకోవడం ఎందుకు?"

"అమ్మో! బేసిక్స్‌లోకి వెళ్లిపోకండి. అన్ని నిబంధనలు ఆవిడ పాటించగల్గితే బహుశా ఆయన ఒప్పకోవచ్చు. ఫోన్ చేసి మీరు రేపొస్తారని చెప్తాను."

ఇద్దరం కలిసి మర్నాడు విద్యానగర్ బ్రాంచికెళ్లాం. అది మా బ్రాంచితో పోలిస్తే చాలా చిన్నది. అంటే, అదృష్టం బావుండి మా ఫీల్డాఫీసరుకి ట్రాన్సఫరైతే అక్కడ మేనేజరైపోవచ్చు. మేం వెళ్లి కార్డు అక్కడ ప్యూన్ చేతిలో పెట్టి, బెంచీల మీద కూచున్నాం. మానేజరనబడే ఆ పెద్దమనిషి కాసేపు కాషియర్ వెనకాల,

కాసేపు ఎకౌంటెంట్ వెనకాల, కాసేపు లెడ్జర్ క్లర్కుల వెనకాల నిలబడి మధ్యమధ్యలో రూఫ్ కేసి చూస్తూ, ఏదో ఆలోచించుకుంటూ, తిరుగుతున్నారు. అప్పుడపుడూ కేబిన్లో కూచుని కార్డు చూసి పక్కన పడేసి రౌండ్లేస్తున్నారు. చివరికి ఇంక లాభంలేదని దారికాశాం. "సార్! మీరు చాలా బిజీగా ఉన్నట్టున్నారు. ఐనా, ఒక్క ఐదు నిమిషాలు మీ కేబిన్లో కూచుంటే మేం మాట్లాడి వెళ్లిపోతాం!"

"సరే ! పదండని!" కెబిన్లోకి దారి తీశారు.

"రామ్మోహన్‌గారు ఫోన్ చేస్తామన్నారు!"

"నిన్న మాట్లాడారు. మీ గురించేననుకుంటా. చాలా పాత ఎకౌంటటగా! మంచి యూనిట్టని అన్నారు." వెంటనే ఉత్సాహంగా, అన్నీ ఏకరువు పెట్టాం. అన్నీ శ్రద్ధగా విన్నారు.

"పాతికవేలంటే ఫరవాలేదు! నా పరిధిలోకి వస్తుంది. మీరు అప్లికేషన్ ఫిలప్ చేసి తీసుకురండి. నలుగు రైదుగురు షాపుల యజమానుల లెటర్స్ కూడా తెండి. అన్నట్టు, మీ ఇంటివాళ్ల దగ్గరినించి ఒక లెటర్ కావాలి. మీకిలా అద్దెకిచ్చినట్టు!"

వస్తూండగా అడిగా " నే పూర్తి చేసివ్వనా అప్లికేషనూ!"అని. తనసలే చాలా సంతోషంలో ఉంది.

"మీకెందుకూ శ్రమ. సాయంత్రం మా బావగారింటికెళ్లి పూర్తి చేయిస్తా. మీరు మళ్లీ ఇంతదూరం రావద్దు. నేనే రెండ్రోజుల్లో సబ్మిట్ చేస్తా. వంటవాళ్లిప్పటికే వెళ్లిపోవడానికి రెడీగా ఉంటారు. వస్తా!" అని చెప్పి వెళ్లిపోయింది. నాలుగురోజులు గడిచాయి. "ఇంకా ఈ పిల్ల దగ్గరనుంచి ఫోన్ లేదేమిటా?" అని అనుకుం టూండగా తనే ఫోన్ చేసింది.

"మా ఇల్లుగల వాళ్లు లెటరిమ్మంటే షెడ్డు ఖాళీ చేసెయ్యమన్నారు. ఇలా అద్దెకిచ్చినట్టు ఉత్తరం ఇస్తే వాళ్లకి టాక్స్ పడుతుందిటా!"

"ఇంతకీ, మీ ఇంటివాళ్ళెవరేవిటీ?"

"మాకు దూరపు బంధువులే. ఆయన నాన్నగారి మీద అభిమానం కొద్దీ మాకీ షెడ్డునిచ్చి వాడుకోమ న్నారు. మామూలుగా ఇక్కడెవ్వరూ వంటలవీ అంటే అసలద్దెకివ్వరు!"

"ఐతే, ఒక పని చెయ్యి. నువ్వు వాళ్ల బంధువులమ్మాయనీ, నీకు సాయం చేసే ఉద్దేశ్యంతో నిన్ను ఆ షెడ్ వాడుకోనిస్తున్నామని వ్రాసివ్వమని చెప్పు!"

"హమ్మయ్య. మంచి ఉపాయమే చెప్పారు. అదే అడుగుతా!"

ఐనా మళ్లీవారం వరకూ అజపజా లేదు. తీరాకనుక్కుంటే, "ఉత్తరాలిచ్చేందుకు షాపుల వాళ్లు తిప్పుతున్నారనీ, రెండ్రోజుల్లో అప్లికేషన్ పూర్తి చేసి ఇస్తాననీ" చెప్పింది. అనగా అనగా ఓ శుభ

ముహూర్తాన అప్లికేషను పట్టికెళ్ళి ఇవ్వడం, మానేజరు గారు ఇంకో ఆఫీసరుగారి కప్పచెప్పి ఇంక అన్ని విషయాలు ఆయనే చూసుకుంటాడని ఈవిడకి చెప్పడం జరిగాయి.

ఇంకొన్నాళ్ళకి తెలిసిన విషయం ఏవిటయ్యా! అంటే, ఆ అప్పచెప్పబడిన ఆఫీసరుగారి తల్లిగారు పోయినందువలన ఆయన నెల్లాళ్లు సెలవు పెట్టారని. ఆనంది వెళ్ళి మానేజరుగార్ని కలిస్తే ఇంకన్నీ ఆయనే చూసుకుంటాడు. నన్ను కలిసి టైం వేస్టు చేసుకోవద్దు. ఆయన లీవు నుంచి వచ్చేవరకు వెయిట్ చేయండి అన్నారుట .

టెలిఫోన్ వాళ్లలాగా మూడు భాషల్లోనూ "యు ఆర్ ఇన్ క్యూ ప్లీజ్‌వెయిటీ" ,"ఆప్ ఖతార్‌మే హై కృపయా ప్రతీక్షా కీజియే", "మీరు క్యూలో ఉన్నారు దయచేసి వేచి ఉండండి" - అంటూ, ఓ అరగంట వినగా వినగా లైను కట్టైనట్లు నెల్లాళ్లు వేచియున్నాక ఆ ఆఫీసరు గారికి రిక్వెస్ట్ మీద ట్రాన్స్ఫరయిందని తెలిసింది.. మళ్ళీ కొత్త ఆఫీసరు గారొచ్చి అన్నీ సర్దుకుని జనాల్ని పలకరించడం మొదలయ్యేసరికి ఇంకో నెల. అప్పుడాయన అంతా చదివి "అయ్యో! కొలేటరల్ లేకుండా అప్లికేషనేమిటండీ(కట్నం లేని పెళ్ళిలాగా)? ఏదో ఒకటి పెట్టాలి మరి." అని కాయితాలు పక్కన పెట్టారట.

అపుడు తను "మా దగ్గిరేముందండి. పాతికవేలలోపు లోనుకు కొలేటరల్ అడగరని మా మేడం చెప్పారు!"

"మేడం కాదండీ డబ్బిచ్చేదీ! ఐనా, కొలేటరల్ అక్కరలేదంటే ఇంకా ఎక్కువడిగేవారా? మీ వాళ్లనెవరినైనా కనుక్కోండి." అని చికాకుగా మాట్లాడారని కళ్ల నాళ్ల పర్యంతం ఔతూ చెప్పింది. చివరికి వాళ్లింటో అందరినీ వెతగ్గా,వెతగ్గా వాళ్లన్నయ్య ఎప్పుడో రుద్రారంలో ఒక కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లో 200 గజాల స్థలం కొన్నట్లుగా బైటపడింది. పాపం, అనంతకృష్ణ ఆ ప్లాటు కాయితాలు, దాన్ని ప్లెడ్జి పెట్టే ఎఫిడవిట్టూ వగైరాలన్నీ వెంటనే పంపాడు. నేనసలు చెప్పకనే చెప్పాను. ఇలా "అన్నయ్యవాళ్ల ప్లాటుందని - వాళ్లకి చెప్పకమ్మా!" అని. కానీ ఓసారి కలిసినపుడు బదరి అన్నాడుట "అన్నయ్య ప్లాటుంది కదా!" అని. అప్పట్నుంచి ఆఫీసరుగారు అన్నీ వదిలేసి ప్లాటు గురించే మాట్లాడేవారుట.

నాకు ఆనంది దగ్గిర నించి వచ్చే కాల్సు వారానికొకటి, 15రోజులకొకటి, 20 రోజులకొకటి, నెలకొకటి వచ్చి వచ్చి పూర్తిగా ఆగిపోయాయి. చివరిసారి చేసినపుడు, "ఇక్కడ పనవ్వట్లేదండీ. నేనెంతో కష్టపడి స్థలం కాయితాలు, 13 సంవత్సరాల ఇ.సి., లేఔటు ప్లానూ, పంచాయతీ ఉత్తరం, ఓ దాని తర్వాత ఓటి వాళ్లడిగిన వన్నీ ఇచ్చాక ప్రాపర్టీ సిటీ లిమిట్స్‌లో లేవు కాబట్టి ఇవ్వడం కుదరదంటున్నారు. నేనిలా తిరుగు తూండటంతో అమ్మని కాసేపు చూడమనడంతో ఆవిడకి ఆయాసం ఎక్కువైపోయింది. సరుకు చాలా

పల్లాము లయిపోయింది. రెండు నెలలనించీ టర్నోవరు తగ్గిపోయింది. ఇంకనే తిరగలేను. ఈసారి మీకు బాగా తెలిసిన ఆఫీసర్లొస్తే ప్రయత్నిద్దాం. మీకు చాలా శ్రమిచ్చాను. క్షమించండి!" అని చెప్పింది.

నాకైతే తలకొట్టేసినట్లైంది. ఇన్నేళ్లనించీ అదే బ్యాంకులో వ్యాపారం చేస్తున్నాం. ఎంతెంత వడ్డీలు కట్టి ఉంటామో! ఆడవాళ్లకది చేస్తాం ఇది చేస్తాం అని ఊరు పట్టని కోతలు కోస్తాం. తీరా క్రియలొచ్చేసరికి అన్ని అర్హతలూ ఉన్న మహిళకు ఏ సాయం చెయ్యలేక పొయ్యాం. అప్రియ సంఘటనలూ, అవమానాలూ, వైఫల్యాలూ మర్చిపోగల్గడం నాకు భగవంతుడిచ్చిన పెద్ద వరం. కొన్నాళ్లకి ఆ విషయం పూర్తిగా మర్చి పోయాను. చూస్తూండగానే మళ్లీ దీపావళి వచ్చేసింది.

ఆవేళ పొద్దునే ఆనంది, అనంత కృష్ణ వచ్చారు, చేతిలో పాకెట్లలో.

"రండి! రండి! ఏం ఆనందీ? ఎలాగూ పనిచేసి పెట్టలేకపోయానని, మాట్లాడ్డం మానేశావా?"

"ఛ! మీరలాంటే నాకు చాలా కష్టమేస్తుంది. మీరెంత ప్రయత్నం చేసారో నాకు తెలియదా?"

"పోన్లే! మీరూ ఇంకోలా అనుకోకపోతే నాకంతే చాలు. ఏం అనంత్ ఎప్పుడొచ్చారు. ఈసారి ఎవరిది పెళ్ళి.

పెళ్ళి కాదు కానీ, ఇంకా మంచి న్యూసే. మనం అప్పుడు లోను తీసుకోకపోవడమే మంచిదైంది. ఆ మధ్య లకడీ-కా-పూల్‌లో ఏదో ఒక ఉడిపి హోటల్ మూసేస్తూ కొన్ని అమ్మకానికి పెట్టారు. అందర్లాగా దీని క్కూడా ఒక జత గాజులు , ఒక గొలుసు చేయించా కదా. అవమ్మేస్తే 9వేలొచ్చాయి. నా పి.ఎఫ్.లోన్ పెట్టి 10వేలు తీసుకుని అక్కడ మనకి కావలసినవన్నీ చౌకలో కొన్నాం. ఇప్పుడు నెలకి 40-50 వేలు టర్నో వరొతోంది. అదీ, బదరీ కలిసి కూకట్‌పల్లి హౌసింగ్ కాలనీలో సింగిల్ రూం ఇల్లు వంద గజాల్లో ఉన్నది సెకండ్ సేల్ వస్తే కొన్నారు. వెనక షెడ్డేసుకుంటే ఇంక మన్ని అడిగేవాళ్లుండరు. శనివారం గృహప్రవేశం. దీపారాధన. కార్డులేం వెయ్యట్లేదు. మీ ఇద్దరూ వచ్చి భోజనం చేసి, పిల్లల్ని ఆశీర్వదించి.."

"ఆగాగు!" భోజనానికేం లక్షణంగా చేస్తాం. కానీ, మా ఆశీర్వాదానికంత బలం ఉంటుందనుకోను. వెనకటికెవడో నాలాటి వాడే, నే వెడితే పనవదుగానీ, చీటీ పంపిస్తాన్నాడుట."

"మీరు మాత్రం మారరంటూ!" ఆ పిల్ల ఆ పాకెట్టు విప్పి ప్లేట్లోపోసి మా ముందు పెట్టింది. "మొత్తానికి మట్టి గుర్రాన్ని నమ్మి ఏట్లోకి దిగకుండా మీరే అన్నీ చక్కబెట్టుకున్నారు!" అంటూ నోట్లో బూందీ పోసుకున్నా.